సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 12 | డిసెంబర్ | 2023



'స్మార్ట్' దోపిడీ..

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే గ్రామాల్లో కొందరు ఆరు గ్యారంటీల పేరుతో నయా దందాకు తెరలేపారు. స్మార్ట్‌గా జనాన్ని దోచుకోవడం మొదలుపెట్టారు.

- 8లో▸



ముగిసిన కిక్‌బాక్సింగ్ పోటీలు

హనుమకొండ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు సోమవారం ముగిశాయి.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29^0 / 16^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. సాయంత్రం నుంచి చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బీటెక్ ఏడో సెమిస్టర్ పరీక్షలు షురూ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీటెక్ ఏడో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. క్యాంపస్‌లోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల పరీక్షల కేంద్రాన్ని రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు, పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధిక సందర్శించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు.

రెండో కాన్పు మహిళలపై ప్రత్యేక శ్రద్ధ : డీఎంహెచ్‌ఓ



ఎంజీఎం : ఆడ సంతానం కలిగి.. తిరిగి గర్భం దాల్చిన మహిళలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నట్లు డీఎంహెచ్‌ఓ బి.సాంబశివరావు తెలిపారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గర్భస్థ పూర్వ, పిండ లింగ నిర్ధారణ చట్టం (పీసీపీఎన్‌డీటీ)పై జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. పీసీపీఎన్‌డీటీ చట్టంపై స్వచ్ఛంద సంస్థలు, ఐసీడీఎస్, ఐకేపీ, మెప్మా వారితో గ్రామాల్లో పట్టణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలతోపాటు స్కానింగ్ సెంటర్లపై నిఘా పెంచుతామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ చట్టంపై టోల్ ఫ్రీనంబర్లు వేయిస్తామన్నారు. అడ్వయిజరీ కమిటీ సభ్యులు జిల్లాలో బాలికల నిష్పత్తి తక్కువ ఉన్న మండలాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి క్షేత్రస్థాయి సిబ్బందితో తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకుబ్ పాషా, గైనకాలజిస్ట్ నిరంజనదేవి, ఉషారాణి, లీగల్ అడ్వయిజర్ రేవతిదేవి, పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ మానస, డెమో అశోక్‌రెడ్డి, డిప్యూటీ డెమో ప్రసాద్ పాల్గొన్నారు.


హక్కులపై అవగాహన ఉండాలి

ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి



వరంగల్ లీగల్: మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి అన్నారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సదన్ బిల్డింగ్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా న్యాయమూర్తి కె.రాధాదేవి మాట్లాడుతూ.. మానవుల మాన ప్రాణాలకు భరోసా కల్పించేవే మానవ హక్కులన్నారు. హక్కుల ఉల్లంఘనల ఫిర్యాదుల్ని సత్వరమే విచారించేందుకు కోర్టులతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయిలో మానవ హక్కుల కమిషన్లు ఉన్నాయని తెలిపారు. అలాగే.. ఈనెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీపడదగు కేసులను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రికార్డుకెక్కిన నేరాలు!



ఐపీసీ క్రైమ్స్ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అధికం

- తర్వాతి స్థానంలో మహబూబాబాద్
- ములుగు జిల్లాలో అత్యల్పం
- మహిళల మిస్సింగ్ అధికం
- భూపాలపల్లి జిల్లాలో బాల నేరాలు సున్నా.
- నేర నివేదిక-22లో వెల్లడించిన నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో
- ఉమ్మడి జిల్లాలో పలు ఆసక్తికర అంశాలు



మహిళలపై దాడులు

కమిషనరేట్	భూపాలపల్లి
1,272	211
ములుగు	**మహబూబాబాద్**
164	461

(వరంగల్ డెస్క్)

హత్యలు.. లైంగికదాడులు.. మిస్సింగ్స్, సైబర్ నేరాలు.. వరకట్న వేధింపులు.. కిడ్నాప్, యాసిడ్ దాడులు, బంధువులు, భర్త తరపు వారి దాడులు, రోడ్డు ప్రమాదాలు, బాలికలపై లైంగిక వేధింపులు, మరణాలు.. షెడ్యూల్డ్ తెగలపై దాడులు.. ఇతరుల నిర్లక్ష్యం వల్ల కలిగిన మరణాలు తదితర అంశాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఒకడుగు ముందే ఉంది. 2022 సంవత్సరంలో ఉమ్మడి జిల్లా పరిధి వరంగల్ పోలీస్ కమిషనరేట్ (హనుమకొండ, వరంగల్, జనగామ), ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో నమోదైన కేసుల నివేదికను ఇటీవల నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) వెల్లడించింది. ఇందులో పలు ఆసక్తికర అంశాలు పొందుపర్చారు. ఐపీసీ నేరాల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప్రథమ స్థానంలో ఉండగా.. మారుమూల గిరిజన జిల్లా అయిన ములుగు చివరి స్థానంలో నిలిచింది. అదృశ్యం కేసుల్లో పురుషుల కన్నా మహిళలవి అధిక సంఖ్యలో నమోదైనట్లు ఎన్‌సీఆర్‌బీ వెల్లడించింది. ఇది ఎంతో ఆందోళన కలిగించే అంశంగా చెప్పొచ్చు. బాలనేరాలు భూపాలపల్లి జిల్లాలో ఏడాది పొడవునా ఒక్కటి కూడా నమోదు కాకపోవడం శుభపరిణామం. మొత్తంగా వివిధ అంశాల్లో నమోదైన కేసులు, వాటి వివరాలను ఒకసారి పరిశీలిద్దాం.

ఐపీసీ, ఎస్‌ఎల్‌ఎల్ (ప్రత్యేక, స్థానిక చట్టాలు) నేరాలు

ఐపీసీ పరిధి కింద హత్య, నేర పూరితహత్య (ఐపీసీ 304), నిర్లక్ష్యపు మరణాలు (రోడ్డు ప్రమాదాలు, వైద్య నిర్లక్ష్యం, మానవ నిర్లక్ష్యం, ఇతర ప్రమాదాలు), వరకట్నం, ఆత్మహత్యకు ప్రేరేపించడం, హత్యాయత్నం, ఆత్మహత్యాయత్నం, హర్ట్ (ఇబ్బంది పెట్టడం), మహిళలపై దాడి తదితర అంశాలను తీసుకున్నారు. ఇందులో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనే అత్యధికంగా 8,956 కేసులు నమోదయ్యాయి. అత్యల్పంగా ములుగు జిల్లాలో 976 కేసులు నమోదైనట్లు ఎన్‌సీఆర్‌బీ వెల్లడించింది. దీంతోపాటు ఎస్‌ఎల్‌ఎల్ (ప్రత్యేక స్థానిక చట్టాలు) పరిధిలో మహిళలపై నేరాలు, చిన్నపిల్లలపై నేరాలు, ఆయుధ చట్టాలు, షెడ్యూల్డ్ క్యాస్ట్, ట్రైబ్స్ చట్టాలు, ఆర్థిక నేరాలు, పర్యావరణాన్ని ధ్వంసం చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగపర్చడం, తదితర నేరాలను ఇందులో పొందుపర్చారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 1,148, భూపాలపల్లిలో 232, మహబూబాబాద్‌లో 283, ములుగులో 76 కేసులు నమోదయ్యాయి.

జువైనల్ క్రైమ్స్ (బాల నేరాలు) తక్కువే..

ఉమ్మడి జిల్లాలో జువైనల్ క్రైమ్స్ (బాల నేరాలు) తక్కువే నమోదయ్యాయి. ఐపీసీ సెక్షన్ కింద వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 55, మహబూబాబాద్‌లో 33, ములుగు జిల్లాలో 4 కేసులు మాత్రమే నమోదయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. అదేవిధంగా ఎస్‌ఎల్‌ఎల్ (ప్రత్యేక, స్థానిక చట్టాలు) పరిధిలో కమిషనరేట్, భూపాలపల్లి జిల్లాల్లో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మహబూబాబాద్‌లో ఒకటి, ములుగు జిల్లాలో రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయి.

అదృశ్య కేసుల్లో మహిళలే అధికం

ఉమ్మడి జిల్లాలో నమోదైన అదృశ్యం కేసుల్లో మహిళలే అధికంగా ఉన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పురుషులు 359, మహిళలు 821 మంది అదృశ్యమైనట్లు కేసులు నమోదయ్యాయి. భూపాలపల్లిలో పురుషులు 32, మహిళలు 101, మహబూబాబాద్ జిల్లాలో పురుషులు 53, మహిళలు 213, ములుగు జిల్లాలో పురుషులు 24, మహిళలు 63 మంది అదృశ్యమయ్యారు. (ఇందులో 12 సంవత్సరాల నుంచి పెద్ద వయస్సు వారు ఉన్నారు.) వీటిలో కొన్ని కేసులు పరిష్కారం అయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2022లో మొత్తంగా 1,666 మిస్సింగ్ కేసులు నమోదైనట్లు ఎన్‌సీఆర్‌బీ తన నివేదికలో పేర్కొంది.


షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎస్సీ)పై ...

కమిషనరేట్	120
భూపాలపల్లి	22
మహబూబాబాద్	19
ములుగు	06


షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ)పై..

కమిషనరేట్	57
భూపాలపల్లి	09
మహబూబాబాద్	25
ములుగు	15

పిల్లలపై దాడులు



సైబర్ క్రైమ్స్



మిస్సింగ్ కేసులు

కమిషనరేట్	1,180
భూపాలపల్లి	133
మహబూబాబాద్	266
ములుగు	87

వినతులు సత్వరమే పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన వినతులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్.. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ 05, హనుమకొండ తహసీల్దార్ 04, హసన్‌పర్తి తహసీల్దార్ 04, 2బీహెచ్‌కే నోడల్ ఆఫీసర్ 4 కలిపి వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 55 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వైవీ గణేశ్, డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, వివిధ శాఖల అధికారులున్నారు.

వినతులు పరిష్కరించండి: ప్రావీణ్య

కరీమాబాద్: ప్రజావాణిలో స్వీకరించిన వినతుల్ని త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో దాదాపు రెండు నెలల తర్వాత కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఇందులో జిల్లాలోని వివిధ గ్రామాల ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రజా సమస్యల్ని మానవతా దృక్పథంతో వేగంగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజావాణికి మొత్తం 47 దరఖాస్తులు రాగా.. వాటిలో ఎక్కువగా పెన్షన్, భూ సమస్యలపైనే ఉన్నాయి. వాటి పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు బదలాయించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్డీఓ సంపత్‌రావుతోపాటు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

హన్మకొండ అర్బన్/కరీమాబాద్: రానున్న పంచాయతీ, ఇతర ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్.. అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. ఈవీఎంలు, వీవీ పాట్లు వేర్వేరుగా ఏర్పాటు చేసి మరోసారి చెకింగ్ చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలు, ఓటర్ల నమోదు, తొలగింపులపై పక్కా ప్రణాళికలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు శ్రీనివాస్, రమేశ్, వరంగల్ నుంచి కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు.

కార్తీక.. సోమవారం



కార్తీక మాసోత్సవం చివరి సోమవారం సందర్భంగా వరంగల్ నగరంలోని వేయిస్తంభాల ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనం నిమిత్తం భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆలయంలో శ్రీరుద్రేశ్వరీ శ్రీరుద్రేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, హనుమకొండ

బల్దియాలో ఫిర్యాదుల స్వీకరణ



వరంగల్ అర్బన్: వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్‌తోపాటు వివిధ విభాగాల అధికారులు ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు చెందిన అధికారులకు బదలాయించారు. ఇంజనీరింగ్ విభాగానికి 9, హెల్త్, శానిటేషన్-6, ప్రాపర్టీ ట్యాక్స్ (రెవెన్యూ)- 6, టౌన్‌ప్లానింగ్ - 28, హార్టికల్చర్‌కు సంబంధించి 1 దరఖాస్తు వచ్చింది. కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, రమేశ్, టీపీఆర్‌ఓ రాజేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

హామీలు నిలబెట్టుకుంటున్న ప్రజా ప్రభుత్వం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హన్మకొండ/కాజీపేట: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్‌లో, కాజీపేట చౌరస్తాలో మహాలక్ష్మి పథకాన్ని ఎమ్మెల్యే నాయిని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తుందని, వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే.. ఆర్టీసీ బస్సులో మహిళలతో కలిసి కాజీపేట వరకు ప్రయాణించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, ఆర్‌టీఓ కంచె వేణు, ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత, డిప్యూటీ ఆర్‌ఎంలు కేశరాజు భాను కిరణ్, మాధవరావు, హనుమకొండ, వరంగల్-2 డిపో మేనేజర్లు భూక్య ధరం సింగ్, సురేశ్, సూపర్‌వైజర్లు నజియా సుల్తానా, చంద్రశేఖర్, శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, నాయకులు ఈవీ శ్రీనివాస్, బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు శ్రీనివాస్, సజ్జన్‌నాయక్, ఎల్లయ్య, ఈఎస్ బాబు, శోభన్ బాబు పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, చిత్రంలో ఆర్టీసీ ఆర్ఎం జాస్తి శ్రీలత, ఆర్టీఓ

కలెక్టర్‌తో ఎమ్మెల్యే నాయిని భేటీ

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు కలెక్టర్ పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి.. కలెక్టర్‌తో భేటీ అయి నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమేశ్, కాజీపేట తహసీల్దార్ బావ్‌సింగ్, ఈవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పల్లె పోరుకు సై..

నోటిఫికేషనే తరువాయి.. ఎన్నికల నిర్వహణకు సిద్ధం

- ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం
- ఓటరు జాబితా, వార్డుల విభజనపై తుది దశకు కసరత్తు
- ఉమ్మడి వరంగల్‌లో 1,708 గ్రామ పంచాయతీలు.. 50 శాతం మహిళలకు రిజర్వేషన్

సాక్షిప్రతినిధి, వరంగల్: పల్లె సమరానికి అంతా సిద్ధమవుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా.. ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. 2019 జనవరి 21, 25, 30 తేదీల్లో మూడు విడతల్లో గత పంచాయతీ ఎన్నికలు జరిగాయి. 2024 జనవరి 31తో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈనేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికలపై అధికారుల కసరత్తు మొదలైంది. కార్యదర్శులను సర్పంచులు, వార్డు సభ్యుల వివరాలు పంపాలని హైదరాబాద్ నుంచి అధికారులు జిల్లా కలెక్టర్‌లను ఇటీవల ఆదేశించారు. ఐదు రోజుల కిందట గ్రామాల వారీగా పంచాయతీ సిబ్బంది వివరాలు కూడా సేకరించారు. గ్రామ పంచాయతీలు, వార్డులకు రిజర్వేషన్లపైనా ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేయడంతో ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా అధికారులు పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లపై వేగం పెంచారు. దీంతో నిన్న మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బిజీబిజీగా గడిపిన ప్రధాన పార్టీల రాజకీయ నాయకులు సైతం అత్యధిక పంచాయతీల్లో పైచేయి సాధించేందుకు పావులు కదుపుతున్నారు.

తుది దశకు ఎన్నికల కసరత్తు..

పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గడువుకు ముందే ఎన్నికల నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుత గ్రామ పంచాయతీల పాలకవర్గం 2024 జనవరి 31వ తేదీతో గడువు ముగియనున్నది. ఎన్నికల నిర్వహణ ప్రస్తుతం నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వంపై ఆధారపడి ఉంటుంది. దీంతో ఎన్నికలు కాలానుగుణంగా నిర్వహిస్తారా? మరి కొద్ది రోజులు గడువు పొడిగిస్తారా? అనే చర్చ ఓ వైపు జరుగుతుండగా.. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం అధికార యంత్రాంగం కసరత్తు తుదిదశకు తెచ్చే పనిలో ఉంది. ప్రతీ 200 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు ఒక పోలింగ్ అధికారిని నియమించే అవకాశం ఉంది. 200 నుంచి 400 మంది ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 మంది ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించేలా ప్రణాళిక రూపొందించారు. 650 మంది ఓటర్లు దాటితే రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడి ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేసేలా నివేదికలు సిద్ధం చేశారు. మరో వైపు 1 జనవరి 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లు పిలుపునిచ్చారు.

మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు?

2014 వరకు ఉమ్మడి వరంగల్‌లో 1,075 గ్రామ పంచాయతీలు ఉండేవి. 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో 500 జనాభా ఉన్న గిరిజన తండాలు, గూడేలు, రెండు కిలోమీటర్ల దూరంగా ఉండి అవకాశం ఉన్న ఇతర పల్లెలను కూడా ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. దీంతో కొత్తగా 633 తండాలు, గూడేలకు గ్రామ పంచాయతీల హోదా దక్కగా.. ఉమ్మడి జిల్లాలో పంచాయతీల సంఖ్య 2019 ఎన్నికల నాటికి 1,708లకు చేరింది. 50శాతం రిజర్వేషన్ కింద 853 గ్రామ పంచాయతీలను మహిళలకు కేటాయించారు. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 2019 జనవరి 21, 25, 30 తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికల ప్రక్రియ జరిగింది. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా 305 గ్రామ పంచాయతీలు, 1,005 వార్డులు ఏకగ్రీవం కాగా.. ఈసందర్భంగా 1,403 గ్రామ పంచాయతీలు, 14,480 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. ఈసారి కూడా తెలంగాణ వ్యాప్తంగా మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఎప్పుడు ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడినా ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే గత పంచాయతీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి గ్రామ పంచాయతీల సంఖ్య అటు ఇటుగా మారే అవకాశం ఉంది. గత ఎన్నికల సమయంలో ఉమ్మడి వరంగల్‌లో ఐదు జిల్లాలే ఉండగా.. భూపాలపల్లి నుంచి కొత్తగా ములుగు ఏర్పడగా, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్‌గా ఉన్న జిల్లాలు హనుమకొండ, వరంగల్‌గా మారాయి. ఈమార్పులో భాగంగా మండలాలు, గ్రామాలు అటు ఇటుగా మారడంతో పాటు కొత్తగా కూడా ఏర్పడ్డాయి.

అమ్మ ఆశయాన్ని నెరవేర్చాలనే తపనతో చదివా..

- బక్కెర నాగలక్ష్మి
- జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక



బక్కెర నాగలక్ష్మి

వరంగల్ లీగల్: 'నా 13 ఏళ్ల వయస్సులోనే మా నాన్న కిషన్ మృతి చెందారు. కడుపేదరికంలో ఉన్నప్పటికీ మా అమ్మ కమల కష్టపడి నాతోపాటు ముగ్గురు సోదరులను కష్టపడి చదివించింది' అని జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన బక్కెర నాగలక్ష్మి తెలిపారు. ఇటీవల హైకోర్టు రిక్రూట్‌మెంట్ రిజిస్ట్రార్ వెల్లడించిన ఫలితాల్లో ఆమె జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని సాయిపేట గ్రామానికి చెందిన కమల-కిషన్ దంపతుల కుమార్తె బక్కెర నాగలక్ష్మి. తండ్రి చనిపోయినా నలుగురు పిల్లలను ఏ లోటూ లేకుండా తల్లి కమల పెంచింది. అందరికీ ఉన్నత చదువులు చెప్పించింది. ఆ కష్టాలను చూసిన నాగలక్ష్మి.. తల్లి .. ఆశలను వమ్ము చేయకుండా చదువుపై దృష్టి పెట్టారు నాగలక్ష్మి. కేయూలో 2009-2014 వరకు ఎల్ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు పూర్తి చేశారు. 2014లో న్యాయవాదిగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. ఎల్ఎల్ఎం చదువుతూనే వరంగల్ కోర్టులో సీనియర్ న్యాయవాది యగ్నేశ్వర వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. తన పెద్దన్న కిశోర్‌కుమార్ ఏసీబీ కోర్టులో స్పెషల్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, మరో అన్న గిరీశ్‌కుమార్ హనుమకొండలో, తమ్ముడు నీలకంఠేశ్వర్ హైదరాబాద్‌లోని హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. తన తల్లి ఆశయాన్ని సాధించాలనే చిన్నప్పటి నుంచి కష్టపడి చదివానని, ఈ పరీక్షలకు సిద్ధమయ్యేటప్పుడు పలుమార్లు విఫలమైనప్పటికీ నిరాశ చెందకుండా ముందుకు సాగానని నాగలక్ష్మి 'సాక్షి'కి తెలిపారు. భర్త, అత్తమామ సహకారంతో పరీక్షల్లో విజయం సాధించానని ఆమె చెప్పారు. నాగలక్ష్మిని గ్రామస్తులు, మిత్రులు అభినందించారు.

క్లుప్తంగా

బాస్కెట్ బాల్ క్రీడాకారుడు యాదగిరిబాబు కన్నుమూత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణానికి చెందిన జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ క్రీడాకారుడు కనమర్లపూడి యాదగిరిబాబు సోమవారం అనారోగ్యంతో కన్నుమూశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, యాదగిరిబాబు మృతిపై బాస్కెట్ బాల్ క్రీడాకారులు, అభిమానులు సంతాపం తెలిపారు.

విద్యుదాఘాతానికి రైతు బలి


రవి(ఫైల్)

చిల్పూరు : విద్యుదాఘాతానికి ఓ రైతు బలయ్యాడు. ఈ ఘటన సోమవారం జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని కృష్ణాజీగూడెం పంచాయతీ పరిధి చక్రి తండాలో జరిగింది. మండలంలోని దేశాయితండాకు చెందిన భూక్యా రవి (28)కి ఇదే మండలం కృష్ణాజీగూడెం జీపీ పరిధిలోని చక్రితండా సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. ఈ క్రమంలో పంట నిమిత్తం భూమిని దున్నేందుకు ఉదయం పొలం వద్దకు చేరుకున్న రవి.. అక్కడ బోరుమోటార్‌కు విద్యుత్ అందించే సర్వీస్ వైరు కిందికి వేలాడుతుండగా దానిని సరిచేసేందుకు పట్టుకున్నాడు. తీగకు అతుకు ఉండడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టు పక్కల రైతులు గమనించి ఎంపీటీసీ నర్సింహులు, బీఆర్ఎస్ నాయకుడు రంజిత్‌రెడ్డికి తెలుపగా వారు ఎస్సై వినయ్‌కుమార్‌తో కలిసి ఘటనా స్థలికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సోమ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కాగా, మృతుడికి భార్య జ్యోతి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పాము కాటుతో మహిళ మృతి


సూరమ్మ(ఫైల్)

చెన్నారావుపేట: పాము కాటుతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన సోమవారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో జరిగింది. ఇదే గ్రామానికి చెందిన గొట్టి సూరమ్మ (54) వంట చెరుకు కోసం గ్రామ శివారులోకి వెళ్లింది. కట్టెలు సేకరిస్తుండగా పాము కాటుకు గురైంది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సూరమ్మ మృతి చెందింది. మృతురాలికి భర్త సమ్మయ్య, కుమారుడు రాజు, కూతురు రమ ఉన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు - 75/-
బ్రాయిలర్ చికెన్ రేటు - 160/-
స్కిన్‌లెస్ చికెన్ రేటు - 180/-
Cell: 9989299661

బలోపేతం, ఆర్థికాభివృద్ధే లక్ష్యం..

బహుళార్థ సేవా కేంద్రాలుగా పీఏసీఎస్‌లు
- పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందజేస్తున్న నాబార్డ్
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 50 సంఘాలకు ప్రయోజనం
- గోదాంల నిర్మాణం, ఇతర వ్యాపారాల నిర్వహణ


నందనం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఐనవోలులో ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్

హన్మకొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి 'నాబార్డ్' నడుం బిగించింది. కేవలం రైతులకు రుణాల జారీ, వసూళ్లకే పరిమితం కాకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బహుళార్థ సేవా కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ఆర్థిక సాయం అందిస్తోంది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలోని పూర్వ వరంగల్ జిల్లాలో మొత్తం 70 ప్రాథమిక సహకార సంఘాలుండగా ఇందులో 50 సంఘాలను బహుళార్థ సేవా కేంద్రాలుగా ఉన్నతీకరించడంతో పాటు ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఎంపిక చేసింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆత్మనిర్భర్ భారత్ అభియాన్' పథకంలో భాగంగా నాబార్డ్, రాష్ట్ర సహకార బ్యాంకు ద్వారా డీసీసీబీ.. ప్రాథమిక సహకార సంఘాలకు 4 శాతం వడ్డీకి ఈ రుణం అందజేస్తోంది. వరంగల్ డీసీసీబీ పరిధిలోని 50 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలో 129 యూనిట్ల నిర్మాణానికి మొదటి విడతలో రూ.28.91 కోట్లు, రెండో విడతలో రూ.9.40 కోట్లు, మూడో విడతలో రూ.7.79 కోట్లు మంజూరు చేసింది.

3 శాతం వడ్డీ మాఫీ..

నిర్మాణ సమయం ఏడాదికి పోనూ ఆ తర్వాతి ఆరు సంవత్సరాల్లో ఇచ్చిన రుణం మొత్తం నాబార్డ్‌కు చెల్లిస్తే 4 శాతం వడ్డీలో 3 శాతం రాయితీ కింద మాఫీ చేస్తుంది. బకాయి సకాలంలో చెల్లించకుంటే పీఏసీఎస్‌లే 4 శాతం వడ్డీని భరించాల్సి ఉంటుంది. బహుళార్థ సేవా కేంద్రాల అభివృద్ధిలో భాగంగా పీఏసీఎస్‌లు.. గోదాంలు, కోల్డ్ స్టోరేజీలు, కన్జ్యూమర్ డీజిల్, పెట్రోల్ పంపులు, మినీ రైస్‌మిల్లుల ఏర్పాటు, వ్యవసాయ సేవా కేంద్రాలు, రైతు శిక్షణ కేంద్రాలు, అగ్రికల్చర్ ఔట్‌లెట్‌లు, కస్టమ్ హైరింగ్ సెంటర్‌లు, సూపర్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నాయి. మొదటి విడతలో 89 ప్రాజెక్టులు చేపట్టగా 60 పూర్తయ్యాయి. 9 యూనిట్ల పనులు కొనసాగుతున్నాయి. 20 యూనిట్ల పనులు మొదలు కావాల్సి ఉంది. రెండో విడతలో 19 యూనిట్ల పనులు మొదలు పెట్టగా 9 పూర్తయ్యాయి. 8 యూనిట్లు పనులు కొనసాగుతుండగా 2 యూనిట్ల పనులు మొదలు కాలేదు. మూడో విడతలో 21 యూనిట్ల పనులు మొదలు పెట్టగా 4 పూర్తయ్యాయి. 13 పనులు ప్రాగ్రెస్‌లో ఉండగా 4 పనులు ప్రారంభం కాలేదు.



బచ్చన్నపేటలో నిర్మించిన ఎరువుల విక్రయ కేంద్రం, మరిపెడ సొసైటీ కొనుగోలు చేసిన హార్వెస్టర్

సహకార రంగంలో వ్యాపారాలకు విస్తృత అవకాశాలు

సహకార రంగంలో వ్యాపారాలు చేసేందుకు విస్తృత అవకాశాలున్నాయి. అయితే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కేవలం రైతులకు రుణాలు జారీ, వసూళ్లకు మాత్రమే పరిమితమయ్యాయి. కొన్నేళ్లుగా ఎరువుల వ్యాపారం, ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నాయి. దీంతో ఈ వ్యాపారం చేస్తున్న సంఘాలు కొంత మేర ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. లాభాల బాటలో ఉన్న సంఘాలను బలోపేతం చేయడంతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వివిధ రకాల వ్యాపారాలు చేసేందుకు నాబార్డ్ పెద్ద ఎత్తున ఆర్థిక సాయం చేస్తోంది. వీటి ద్వారా పీఏసీఎస్‌లు వ్యాపారాలు చేస్తూ లాభాలు గడించి పటిష్టం కావాలన్నదే నాబార్డ్ ప్రధాన లక్ష్యం.

ఆచితూచి ఎంపిక

లాభాల బాటలో ఉండి తిరిగి రుణాలు చెల్లించే స్థోమత కలిగిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మాత్రమే బహుళార్థక సేవా కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు నాబార్డ్ ఎంపిక చేసింది. నష్టాల్లో కూరుకుపోకుండా ఉండేవి, గతంలో సంఘాల లాభనష్టాలు బేరీజు వేసుకుని, మంచి టర్నోవర్ కలిగిన సంఘాలను ఆచితూచి ఎంపిక చేశారు. దీంతో వరంగల్ డీసీసీబీ పరిధిలో గోదాంల నిర్మాణానికి పీఏసీఎస్‌లు ప్రాధాన్యం ఇచ్చాయి. 68 గోదాంలు నిర్మిస్తుండగా ఇందులో 42 పూర్తయ్యాయి. 23 అగ్రి ఔట్‌లెట్‌లు, రెండు కోల్డ్ స్టోరేజీలు, వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు వ్యవసాయ యంత్రాలు అందుబాటులో ఉండేలా అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకుగాను 5 కస్టమ్ హైరింగ్ సెంటర్లు, 20 స్టోరేజీ కమ్ ఆఫీసర్ భవనాలు, రెండు రైస్ మిల్లులు, ఒక ప్యాడీ ప్రాసెసింగ్ యూనిట్, 7 ట్రైనింగ్ సెంటర్ కమ్ గోదాంల నిర్మాణాలు చేపట్టారు. ఒకటి పెట్రోల్ పంపు, ఒక సూపర్ మార్కెట్ ఏర్పాటు చేశారు.

బహుళార్థక సేవా కేంద్రాలతో సంఘాలు బలోపేతం..



బహుళార్థక సేవా కేంద్రాల ఏర్పాటుతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు మరింత బలోపేతమవుతాయి. నేను చైర్మన్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న నందనం పీఏసీఎస్ ద్వారా ఐనవోలులో సూపర్ మార్కెట్ ఏర్పాటు చేశా. దీని ద్వారా సంఘానికి ఆదాయం వస్తోంది. సంఘాల ఆర్థిక పరిపుష్టికి నాబార్డ్ ఆర్థిక సాయం ఎంతో దోహదపడుతోంది.

– మార్నేని రవీందర్ రావు, డీసీసీబీ చైర్మన్,వరంగల్

సహకార సంఘాల బలోపేతానికి నాబార్డ్ సాయం..



ప్రాథమిక సహకార సంఘాల బలోపేతానికి నాబార్డ్ రాయితీతో కూడిన ఆర్థిక సాయం అందిస్తుంది. ఈ రుణంతో సహకార సంఘాలు వివిధ రకాల వ్యాపారం చేస్తూ లాభాలు గడిస్తూ బలోపేతం కావాలి. ఆర్థికాభివృద్ధి సాధించడానికి ఈ సాయం ఎంతో దోహదపడుతుంది. సంఘాలు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– జి.నాగేశ్వర్ రావు, జిల్లా సహకార అధికారి, హనుమకొండ

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్..

- అక్కడికక్కడే ఇద్దరి దుర్మరణం


తులసీరాం(ఫైల్)

రాయపర్తి: నిలిచి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదం మండలంలోని కిష్టాపురంక్రాస్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నాగాయలంక మండలం నంగేగడ్డకు చెందిన జయంత్(21), సంగెం మండలం ఎల్గూర్ రంగంపేట తూర్పుతండాకు చెందిన బోడ తులసీరాం (40) బైక్‌పై వెళ్తున్నారు. మండలంలోని కిష్టాపురం క్రాస్‌లో కోదాడ నుంచి సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ నిలిపి డ్రైవర్ గాలి చెక్ చేస్తున్నాడు. ఈ క్రమంలో తొర్రూరు నుంచి రాయపర్తి వైపునకు వస్తున్న బైక్ వెనుక నుంచి లారీని ఢీకొట్టడంతో తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను ఎంజీఎంకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడు..


నరేష్ (ఫైల్)

భూపాలపల్లి రూరల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం భూపాలపల్లి మండలం కమలాపూర్ క్రాస్ సమీపంలో జరిగింది. మండలంలోని చికెన్‌పల్లి గ్రామానికి చెందిన చక్రం నరేష్ (28) పని నిమిత్తం బైక్‌పై భూపాలపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కమలాపూర్ క్రాస్ సమీపంలో మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడింది. దీంతో అటుగా వెళ్తున్న గ్రామస్తులు చూసి వారి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు హుటాహుటినా తీవ్ర గాయాలైనా నరేష్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ వెల్లడించారు.

ముగిసిన కిక్ బాక్సింగ్ పోటీలు

- ఓవరాల్ చాంపియన్‌షిప్ హనుమకొండ

హన్మకొండ: హనుమకొండ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో రెండు రోజులు నిర్వహించిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు సోమవారం ముగిశాయి. 18 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలు.. నువ్వా..?నేనా? అన్నట్లు సాగాయి. వివిధ కేటగిరీల్లో ఆతిథ్య హనుమకొండ జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. రెండో స్థానంలో జగిత్యాల, మూడో స్థానంలో రంగారెడ్డి జిల్లాలు నిలిచాయి. ముగింపు పోటీలకు ప్రముఖ వ్యాపారవేత్తలు శీలం శ్రీధర్, మందాటి మనోజ్ హాజరై విజేతలకు బహుమతులు, పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డి సతీష్ మూర్తి, మురళి, అవినాష్, నరేందర్, తెలంగాణ కిక్ బాక్సింగ్ ప్రెసిడెంట్ సి రామాంజనేయులు, సెక్రటరీ ఎం మహిపాల్, కోశాధికారి పి శ్రీనివాస్, జిల్లా ప్రెసిడెంట్ బండారి సంతోష్, కార్యదర్శి ఎస్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


ఓవరాల్ చాంపియన్‌షిప్ హనుమకొండ జిల్లా క్రీడాకారులతో నిర్వాహకులు

కాశిబుగ్గలో చోరీ

- రూ. 3 లక్షలు దోచుకెళ్లిన దుండగులు


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ కాశిబుగ్గ వివేకానందకాలనీలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు వెనుక తలుపు తెరిచి ఇంట్లోకి చొరబడి బీరువా పగులకొట్టి రూ.3 లక్షలు నగదు దోచుకెళ్లారు. బాధితుడు అడికిచర్ల శ్రీనివాస్ కథనం ప్రకారం నవంబర్ 7న తన కూతురు పెళ్లి జరిగిందని, 10న ఆదివారం పెళ్లి కుమారుడు ఇంటికి వెళ్లి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి రాగా ఇంటి వెనుక తలుపు తెరిచి బీరువా పగుల కొట్టి ఉందన్నారు. దీంతో భయాందోళనకు గురైన వారు బీరువాను చూడగా అందులో ఉన్న నగదు రూ.3 లక్షలు పోయినట్లుగా గుర్తించి ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు, క్లూస్‌టీం వచ్చి వివరాలు సేకరించారు. సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించారు. సీసీ కెమెరాలో అనుమానాస్పదంగా కనిపించిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లుగా తెలిసింది. గత నెలలో ఇదే కాలనీలో ఓ ఇంట్లో రూ.54 వేల నగదు మరో రెండు ఇళ్లలో నగదు, బంగారం, సెల్ ఫోన్లు కూడా చోరీ అయినట్లు అక్కడి స్థానికులు తెలిపారు. అలాగే శివాలయం సమీపంలో ఇటీవల ఓ బైక్ కూడా పోయిందని, నగరంలో పోలీసులు పెట్రోలింగ్ చేయకపోవడంతో కాశిబుగ్గలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. పోలీసులు స్పందించి నగరంలో రాత్రి వేళల్లో పెట్రోలింగ్ చేపట్టి దొంగతనాలను, పోకిరీల వికృత చేష్టలను అరికట్టాలని పలుకాలనీల వాసులు కోరుతున్నారు.

'స్మార్ట్' దోపిడీ..

- ఆరు గ్యారంటీల పేరుతో నయాదందా
- గ్రామాల్లో వెలుగు చూస్తున్న ఘరానా మోసాలు
- మొండ్రాయిలో ఆరు పథకాల స్మార్ట్ కార్డుల జారీ
- తీగారాజువల్లిలో ఈకేవైసీ పేరుతో రూ. 100 చొప్పున వసూలు



తీగరాజుపల్లి సాయిచైత్ర ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులుదీరిన మహిళలు


స్మార్ట్ కార్డులు చూపుతున్న గ్రామస్తుడు

సంగెం: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలుదీరిన వెంటనే గ్రామాల్లో కొందరు ఆరు గ్యారంటీల పేరుతో నయా దందాకు తెరలేపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన విషయాన్ని క్యాష్ చేసుకుని స్మార్ట్‌గా జనాన్ని దోచుకోవడం మొదలు పెట్టారు. దీనికి నిదర్శనమే ఈ ఘటనలు. మండలంలోని మొండ్రాయి గ్రామంలోని మీసేవా నిర్వాహకుడు తూర్పాటి స్వామి గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో బస్సు పాస్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతు భరోసా, యువ వికాసం పథకాలకు దరఖాస్తులు చేసి ఐడీ కార్డులు ఇవ్వబడునని, వివరాలకు 9000285951లో సంప్రదించాలని పోస్ట్ చేశాడు. దీనిని చూసిన గ్రామానికి చెందిన నారగోని అనిల్ మీసేవా కేంద్రానికి వెళ్లగా పురుషుల పేర కార్డులు జారీ కావని చెప్పగా తన భార్య మాధవి పేరు రేషన్‌కార్డు నంబర్, సెల్ నంబర్ చెప్పగా నిర్వహకుడు స్వామి రూ.300 తీసుకుని ఆరు గ్యారంటీల పేరుతో లబ్ధిదారు పేరు, సెల్‌నంబర్ వచ్చేలా ముద్రించి స్మార్ట్ కార్డులు జారీ చేశాడు. దీంతో తాను ఆరు గ్యారంటీలకు సంబంధించిన స్మార్ట్ కార్డులు తీసుకున్నానని, మిగతా గ్రామస్తులు కూడా తీసుకోవాలంటూ గ్రామ గ్రూపులో, తన మిత్రులకు అనిల్ పోస్ట్ చేశాడు. వీటిని చూసిన పలువురు అసలు ప్రభుత్వం ఆరు గ్యారంటీలపై ఎలాంటి విధానాలు రూపొందించలేదని, మీసేవా కేంద్రాలకు కార్డులు జారీ చేయమని ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదంటూ తెలిపారు. అనంతరం ఈ విషయాన్ని విలేకరుల దృష్టికి తీసుకొచ్చారు. కాగా, మీసేవా నిర్వాహకుడు తూర్పాటి స్వామి గతంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రజల వద్ద డబ్బులు వసూలు చేయగా అధికారులు చర్యలు తీసుకున్నారు. అయినా స్వామిలో మార్పు రాకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని పై తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావును 'సాక్షి' వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదని, ప్రజలు ఇలాంటి మోసపూరిత మాటలు నమ్మి స్మార్ట్ కార్డులు తీసుకోవద్దని సూచించారు.

ఈ– కేవైసీ పేరుతో రూ 100 వసూలు..

సబ్సిడీ గ్యాస్ రూ .500కే వర్తించాలంటే వినియోగదారులు బుక్, ఆధార్‌కార్డును ఏజెన్సీలో ఈకేవైసీ చేయించుకోవాలనే ప్రచారం విస్తృతంగా జరిగింది. దీంతో మహిళలు గ్యాస్ ఏజెన్సీల ఎదుట బారులు దీరుతున్నారు. ఇదే అదునుగా భావించిన మండలంలోని తీగరాజుపల్లిలోని సాయి చైత్ర ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు ప్రతి మహిళ వద్ద రూ. 100 తీసుకుని ఈ కేవైసీ చేస్తున్నారు. కొందరు డబ్బులు తెచ్చుకోకపోవడంతో వారి కుటుంబీకులకు ఫోన్లు చేసి తెప్పించుకుంటూ కేవైసీ చేయించుకుంటున్నారు. ఈ విషయంపై జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఈకేవైసీ చేయడానికి ఎలాంటి రుసుం అవసరం లేదని, గ్యాస్ ఏజెన్సీలు ఉచితంగానే చేయాలన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, ఇలాంటి మోసాలు జరగకుండా అధికారులు విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గుండెపోటుతో కండక్టర్ మృతి


మధుకర్ (ఫైల్)

నెహ్రూసెంటర్/నర్సంపేట రూరల్ : గుండెపోటుతో ఓ కండక్టర్ మృతి చెందాడు. ఈ ఘటన నర్సంపేట పట్టణంలో జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిలా కేంద్రానికి చెందిన మోత్కూరి మధుకర్ (58) మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో మధుకర్ సోమవారం మహబూబాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులో విధులు నిర్వర్తించాడు. బస్సు నర్సంపేట సమీపంలోకి రాగానే ఛాతిలో మంట వస్తుందని చెప్పడంతో వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వెంటనే చికిత్స నిర్వహించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో ఎంజీఎం రెఫర్ చేశారు. అక్కడికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగానే మృతిచెందాడు. మృతుడు మధుకర్‌కు భార్య రమాదేవి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా, మధుకర్ భౌతికకాయానికి సీపీఐ మానుకోట జిల్లా కార్యదర్శి విజయసారథిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే, నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మీ, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు.

13న గ్రహణమొర్రి ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

విద్యారణ్యపురి: హైదరాబాద్‌లోని బసవ తారకం హాస్పిటల్, సమగ్ర శిక్ష, ప్లాస్టిక్ సర్జరీ డి.ముకుందారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 13న ఉదయం 10 గంటలకు హనుమకొండలోని భవిత కేంద్రంలో గ్రహణమొర్రి వ్యాధికి ఉచిత స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు డీఈఓ అబ్దుల్‌హై సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల నుంచి 50 సంవత్సరాల వయసు కలిగిన వారు ఈ స్క్రీనింగ్ క్యాంపునకు హాజరుకావచ్చునన్నారు. క్యాంపులో గ్రహణమొర్రి కలిగినవారికి శస్త్రచికిత్స అవసరమైతే బసవతారకం ఆస్పత్రిలో ఉచితంగానే చేస్తారని తెలిపారు.

WANTED
HOTEL STAFF
త్వరలో ప్రారంభం కానున్న స్టార్ A/c హోటల్ కొరకు
- వెయిటర్స్ (Waiters)
- కెప్టెన్స్ (Captions)
- ఫ్రంట్ ఆఫీస్ (Front Office)
- హౌస్ కీపింగ్ బాయ్స్ (House Keeping Boys)
- హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్స్ (House Supervisors)
- కిచెన్ డిపార్ట్‌మెంట్ (Kitchen All Departments)
ఎర్రగట్టు గుట్ట, కిట్స్ కాలేజ్ దగ్గర.
Cell: 7989183332, 9705987857

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

కుడా లేఅవుట్ ప్లాట్లు అమ్మబడును
GWMC పరిధి ధర్మారం, నర్సంపేట్ రోడ్ న్యూ వెంచర్, 20 ఎ॥ బుకింగ్ మొదలైంది. మా పాత వెంచర్స్‌లో రీసేలింగ్ ప్లాట్లు కలవు. సైట్స్: వరంగల్, కీర్తినగర్, ఆరేపల్లి, చింతగట్టు, ఒగ్లాపూర్, ఘనాపూర్(స్టే), ఆఫీస్: సుబేదారి, HNK. టీస్టాల్. 9618331226 [W-1229328]

PLOT FOR SALE
KUDA, GWMC అప్రూవ్డ్ రెసిడెన్షియల్ ప్లాట్లు చింతగట్టు క్యాంప్ వద్ద తక్కువ ధరలో అమ్మబడును. గజం 15,000/- మాత్రమే. సంప్ర॥ షాబుద్దీన్ - 9618892127. [W-1229333]

HYD హైవే @ ఆరేపల్లి అతి దగ్గరలో DTCP - TLP No.165/2023/H అప్రూవల్ పొందిన లే-అవుట్ యందు ప్లాట్లు అమ్మబడును. రూ. 4999/-per sq yd EMI సౌకర్యం కలదు. సంప్ర॥ 9390119772, లేదా 8332082070. [WA-7256]

SERVICES

LOANS CONSULTANCY
హోమ్ లోన్స్, మార్టిగేజ్ లోన్స్, పర్సేజ్ లోన్స్, బిజినెస్ లోన్స్ తక్కువ వడ్డీతో ఇప్పించబడును. AA లోన్స్ కన్సల్టెన్సీ. సంప్ర: 9014644343, 8330924741. [WA-5806]

వ్యాపార అవకాశం
భారతదేశంలో అతిపెద్ద ఆయుర్వేద సంస్థ ఇప్పుడు అందరికి (బిజినెస్) అవకాశం కల్పిస్తుంది. వరంగల్‌లో తేది: 12-12-23, టైం: 12 PM కు సెమినార్ ఉంది. సంప్ర: 9398239725, 7780219166. [W-788964]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED
హన్మకొండలోని మా ఇంట్లో వంట పనిచేయుటకు వంట మనుషులు భార్యభర్తలు /వంట మాస్టర్ పురుషులు కావలెను సంప్ర॥ సెల్: 9866012888. [W-1229334]

మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర: 9177736926 [G-824749]

శ్రీసాయిరాం హోమ్‌కేర్ Hydలో శ్రీమంతుల ఇండ్లలో ఇంటిపని వంటపని, వృద్ధులను, చిన్న పిల్లలను చూసుకొనుటకు స్త్రీ/పు కావలెను. జీ.18000, ఏజెంట్ కమీషన్ 7K. ఫోన్ 9666001826, 9666001827 [H-793441]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వైభవంగా రుద్రేశ్వరస్వామి వారి కల్యాణం

- చూసి తరించిన భక్తజనం
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కల్యాణోత్సవంలో తాళిని చూపుతున్న ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో కార్తీకమాసోత్సవాల్లో భాగంగా సోమవారం మాసశివరాత్రిని పురస్కరించుకుని శ్రీరుద్రేశ్వరీ శ్రీరుద్రేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసంలోని చివరి సోమవారం కావడంతో వేలాదిమంది భక్తులు ఆలయాన్ని సందర్శించారు.ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మణికంఠశర్మ, అర్చకులు ప్రణవ్, సందీప్‌శర్మ ఉదయం 4 గంటల నుంచి సుప్రభాత సేవ, ఉత్తిష్టగణపతికి పంచామృతాభిషేకం, గరికపూజ, శ్రీరుద్రేశ్వరస్వామి వారికి పాశుపత ఏకాదశ రుద్రాభిషేకం జరిగాయి. 200 మంది దంపతులు సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం మహాశివలింగాన్ని అన్నసూక్త మంత్రపఠనంతో 51 కిలోల పెరుగన్నంతో కార్తీకదామోదరుడిగా అలంకరించి మహాఅన్నపూజ నిర్వహించారు. మహాహారతి మంత్రపుష్పం అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

వైభవంగా కల్యాణోత్సవం..

మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్న సుముహూర్తమున దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీరుద్రేశ్వరిదేవి, శ్రీరుద్రేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి అంకురారోపణ, గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహారాధన, మంటపారాధన, దీపారాధన, విగ్రహ ప్రతిష్ఠారాధన చేసి శ్రీరుద్రేశ్వరిదేవి, శ్రీరుద్రేశ్వరస్వామి వార్లకు పురాణోక్త కల్పోక్తప్రకారం బాసికధారణ, యజ్ఞోపవీతధారణ, పాదప్రక్షాళన, జీలకరబెల్లం, మాంగల్యధారణ, అక్షతారోహణ, మహాహారతి తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. వేదపండితులు కోమాళ్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ కల్యాణతంతు నిర్వహించారు. కల్యాణోత్సవం దాతగా బోసు ప్రమోద్‌కుమార్ దంపతులు పాల్గొని తలంబ్రాలు అందజేశారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు.

పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, అలాగే వేయిస్తంభాల దేవాలయం ముందు భాగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని గతంలో కాంగ్రెస్ హయాంలోనే గార్డెనింగ్, రోడ్డు వెడల్పు తదితర అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఉపేంద్రశర్మ ఆలయమర్యాదలతో ఘనంగా స్వాగతించారు. పూజల అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. సాయంత్రం ప్రదోషకాలపూజలు, సోమశేఖరశర్మచే కార్తీకపురాణ ప్రవచనం జరిగింది. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

కాళేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



కాళేశ్వరం: జయశంకర్ జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయానికి కార్తీకమాసం చివరి సోమవారం భక్తులు పోటెత్తారు. ముందు గోదావరిలో పుణ్యస్నానాలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శుభానందదేవి అమ్మవారి ఆలయంలో మహిళలు కుంకుమార్చనలు చేశారు. దేవస్థానం ఈఓ మహేష్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పర్యవేక్షణలో భక్తుల ఏర్పాట్లు చేపట్టారు. కాగా, సోమవారం వివిధ పూజలు, లడ్డు, ప్రసాదాల ద్వారా రూ.5.52 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం(నేటి)తో కార్తీకమాసం నెల ముగియనుంది.